
# వ్రతభంగం




రచన :
కన్నెకంటి ప్రభాకర శాస్త్రి

సత్యం మంచంమీద దొర్లాడు. ఇంట్లో కుసుమ వంటపాత్రలతో యుద్ధం చేస్తుంటే ఆ గోలకు లేచాడు. మనసులో ఆ ఏడుకొండలవాడికి నమస్కారం చేస్తూ అనుకున్నాడు. ఈ రోజన్నా నా పేరు సార్ధకపర్చు దేవా!" ఆరు నూరయినా నూరు ఆరయినా ఈరోజు అబద్ధమాడ కూడదని నిర్ణయించుకున్నాడు. అయితే మన సత్యం నందిని పందిని పందిని నందిని చెయ్యగల సమర్ధుడు. ఆఫీసులో అట్లా ఎన్నో కార్యాలు సాధించాడు. కాని ఈ అబద్ధాన్ని జయించలేకపోతున్నాడు. ఈవిధంగా ఎన్నోసార్లు నిర్ణయించుకోవటం చివరకు ఒక్క అందాన అబద్ధం ఆడటం వ్రతభంగం జరగటం అవుతూనే వుంది. నూటికి నూరుపాళ్ళు విజయవంతం కావాలని నిర్ణయించుకున్నాడు మన సత్యం.

ఈవిధంగా ఆలోచిస్తుంటే మరలా కునుకుపట్టిన సత్యానికి కూరగాయల మనిషికేక కారుహారన్‌లా వినిపించింది. ఇంతలో " శ్రీమతిజీ " వచ్చి కూరల బేరం చేస్తుంటే ఇక సత్యం నిద్రపోలేకపోయాడు. కాబేజి వీశె అర్ధ రూపాయి అంటుంది కూరలమనిషి. కాదు ఆరు అణాలు అంటుంది శ్రీమతి. వెంటనే లేస్తూ "ఆఁ నిన్ననేకదూ నేను తెప్పించింది వీశె అయిదణాలు" అన్నాడు. అంతవరకూ వాదిస్తున్న కూరల మనిషి సరె తీసికోమ్మా అని అయిదణాలకు యిచ్చిపోయింది. కాని సత్యం నాలుక కరచుకొన్నాడు. నిన్నకాదుకదా కనీసము నెలరోజులనుండైనా ఒక కానీ యిచ్చి కూరలు కొన్నపాపాన పోలేదు. అయ్యో ప్రథమంలోనే అబద్ధమాడానే అని అనుకొన్నాడు. ఇంతలో మెరపులా ఒక ఆలోచన వచ్చింది. సూర్యోదయం కాలేదు కాబట్టి ఈరోజుక్రిందకు లెఖ్ఖకు రాదు లెమ్మని సరిపెట్టుకున్నాడు.

లేచి స్నానంచేసి కాఫీ త్రాగాడు సత్యం. గుడ్డలు మార్చుకొన్నాడు. ఇదివరకు వేసికున్నది స్లాగ్‌షర్టు. ఇప్పుడు వేసికున్నది షర్టుకావడం మూలమున గుండీలు కావలసివచ్చినై. "కుసుమా? నా గుండీలు ఏవీ? అని అడిగాడు.

కుసుమ తన అందమైన విశాలనేత్రాలను త్రిప్పుతూ ' నాకేం తెలుసు ? ' అన్నది.

ఈ సమాధానంవిన్న సత్యం సహించలేక "ఆ ఏమన్నావు? ఆ రోజు నీ చేతికిస్తే ఈరోజు తెలియదంటావా? వెతుకు? మరీ సోమరితనం ఎక్కువైందే?" అని అన్నాడు. పాపం కుసుమ తన విశాలనేత్రాలనిండా నీళ్ళుత్రిప్పుకొని చచ్చీచెడి ఇల్లంతా గాలించి తెచ్చియిచ్చింది అరగంటకు. కాని సత్యానికి తెలుసు తను కుసుమచేతికి యివ్వలేదని. ఆవిధంగా చెప్పకపోతే కుసుమ వెదకదు. మరి తను వెతుక్కోగలడా ! అయినా ఈ అబద్ధంవలన ఎవరికీ ఏమంత అపకారం లేదని సరిపెట్టుకున్నాడు. అయితే కుసుమను కష్టపెట్టానే అని మాత్రం మరచిపోలేకపోయాడు సత్యం. తరువాత కూర్చుని పైళ్ళు తిరగవేస్తున్న సత్యానికి ఒక ఫైలు శత్రువులా కనుపించింది. ఈనాటికి గుమస్తా వ్రాసిన తేదీకి కనీసం ఒకనెల వ్యవధి వుంది. దానిని ఈనాడు పంపితే పంపించినాడని సంతోషించక పోగా సంజాయిషీ అడుగుతారు. అంద్చు సత్యం ఆలోచనలో పడ్డాడు. కాని తప్పదనుకొని తారీఖు నిజమైనదివేసి నెలలో మాత్రము పోయిననెల వేసి వెంటనే మూసివేశాడు ఫైలును. అయ్యో ఇదేమిటిరా అనుకున్నాడు. కాని అతని కళ్ళు ఆనందంతో నిండినవి. అవును. ఇందులో తను అబద్ధమాడిందేముంది. పోతే నెల ఒకటి తక్కువవేశాడు. చెప్పలేదుకదా! చెప్పితేగా తన వ్రతభంగం. ఈ ఆలోచన కలిగినందుకు తనను తను ఎంతో అభినందించుకున్నాడు. అయినా ఇకమాత్రము యీలా చేయగూడదని నిర్ణయించుకున్నాడు.

తొమ్మిది గంటలవుతుంది. క్రొత్త ఆఫీసరొచ్చి వారంరోజులౌతుంది. ఫస్టు ఇంప్రెషన్‌మీద నమ్మకం గలవాడు కాబట్టి సత్యం కొంత 'పంక్చుయాలిటీ'

అమలుజరుపుతున్నాడు. కుసుమా! ఈ రోజు మా పై ఆఫీసరు వస్తున్నాడు. వంట పది గంటలకే కావాల సుమా! అని పురమాయించాడు. పాపం కుసుమ పది గంటలకే అన్ని సిద్ధంచేసి భోజనానికి లేపింది. ఆకలి కాకపోయినా నాలుగు మెతుకులు తిన్నాడు సత్యం. కుసుమనుచూస్తే జాలివేసింది. కాని తనేం చేయగలడు ? ఈవిధంగా భయపెట్టి చెప్పబట్టి వంటయింది. ఈ సమయంలో ఏమీ ' ఫీలు ' కాలేదు సత్యం.

ఆఫీసుకుపోతుంటే ఆఫీసరు ఎదురుపడి సత్యానికి "ఏం సత్యం ఎక్కడనుండి?" అని అడిగాడు. ఆఫీసునుండి సార్—నిన్నటి ఎరియర్సు క్లియర్‌చేసి వస్తున్నాను అన్నాడు ఈసమాధానమైతే ఆఫీసరుకు నచ్చుతుందని. ఆయన చిరునవ్వు నవ్వుతూ 'అయితే ఉదయం పూటకూడా ఆఫీసుకు పోతున్నావన్నమాట! ఇప్పటి గుమస్తాలకు రెస్పాన్స్‌బులిటీ లేదోయ్ అని అన్నాడు. కాని ఆయన ఎన్ని కాగితాలను చించి పారవెయ్యటం చేశాడో? ఒక కాగితం నంబరు మరో కాగితానికి వేశాడో ఎన్నిసార్లు Stayed away from duty యో గుర్తుకు రాలేదప్పుడు. సత్యం ఆయన దగ్గరనుండి బయటపడ్డాడు. ఇంతలో తన బాల్యస్నేహితుడు మురళి కనపించాడు. ఏం సత్యం బాగున్నావా ? అని ప్రశ్నించాడు. ప్రశ్నిస్తూనే అరే మా అమ్మకు జబ్బుగావుందిరా? మందు కావాలి ఒక పది రూపాయిలుంటే సర్దు అన్నాడు దీనంగా ! సత్యం జాలివేసిన ముఖంపెట్టి 'అయ్యో ! నిన్న అడగక పోయావుగదరా! మా ఖసెస్‌కి రు 70/- పెట్టి నైలాన్ చీరెకొన్నాను అని మురళిని పంపించివేశాడు. కాని తను చీరె కొనలేదని తన మామగారి దగ్గరనుండి నిన్నవచ్చిన రెండు వందల రూపాయిలు మొత్తం యిప్పుడు తన జేబులో వుందని సత్యానికి తెలియకపోలేదు. మురళికిస్తే ఇక తిరిగి రాదు. కాని ఇది అబద్ధమేలా అవుతుంది. మురళి అమ్మ నిన్న ఉదయం కనిపించింది. పిడికటి రాయిలా వుంది. ఇది అబద్ధం కాదు. డబ్బును పొదుపుగా వాడే ఒక సూత్రం అని అనుకున్నాడు. ఈ రభసలో ఆగిపోయిన సత్యం గడియారం చూసుకొనే సరికి పదకొండు గంటలకు అయిదు నిమిషాలు తక్కువ. ఆంధ్రరాష్ట్రము మారిపోయి ఆంధ్రప్రదేష్‌రాగానే వచ్చిన ఒక గొప్ప మార్పు ఏమిటంటే పదకొండు గంటలకు తెరిచే ఆఫీసు పదిన్నరకే తెరవటం. ఇప్పటికే ఇరవైఅయిదు నిమిషాలు లేటు. ఆఫీసులోకెళ్లి అటెండెన్సు రిజిష్టరులో చేవ్రాలుపెడుతుంటే ఆఫీసరు గడియారంవంక చూచి 'ఏం ఆలస్యం' అన్నాడు కటువుగా! (కాని తన పైఆఫీసరు ఊళ్లోలేనపుడు సాయంత్రం నాలుగు గంటలకు తను వొస్తే ఆయన డిక్షనరీలో అదిమాత్రం లేటు కాదు) వెంటనే మన సత్యం తడుముకోకుండా 'మా మిసెస్‌కు జ్వరం తగిలిందండి! వంట నేనే చేసికోవాల్సివచ్చింది. అందుకని...' అని వెంటనే తన సీటు దగ్గరకుపోయాడు సత్యం. కాని మనసెందుకో బాధపడింది. 'నేను ప్రాణప్రదంగా చూచుకొనే కుసుమకు జ్వరమని చెప్పానే! అని బాధపడ్డాడు! ఇది కాక ఏదిచెప్పినా ఫరవాలేదు కాని ఏం చేస్తాడు! ఆ రాక్షసుడు తనచేత అలా అబద్ధం ఆడించాడు.

ఇంతలో ప్యూనువచ్చి పై ఆఫీసరు పిలుస్తున్నాడని చెప్పాడు. ఎవరు ఎట్లా భయపడినా, బాధపడినా ఆఫీసరు పిలచాడంటే సత్యానికి బాధలేదు. ఎందుకంటె తాను అప్-టు-డేటుగా ఎప్పుడూ ఏడవలేదు తన హయాంలో. డిలేలు చాలా యెక్కువ. అందుకు అరవటానికి ఆయనకు ఓపిక లేకపోవాల్సిందే కాని తనకు బాధలేదు వంటో నిలుచోవటానికి. వెంటనే ఆఫీసరుదగ్గిరకుపోయి వచ్చాడు. ఇంతలో ప్యూనువచ్చి రెండణాలు యివ్వండి బాబు ! కాఫీ త్రాగుతాను అన్నాడు. కాని సత్యం జేబు తడుముకొని ' అరె ! చిల్లరలేదురా' అన్నాడు. కాని తను కిళ్లీకొట్లో మార్చిన రూపాయిలో మిగిలిన పదునాలుగు అణాలు జేబులో వున్నవి. ఏవి అబద్దాలని తోచినా తోయకపోయినా ఇది మాత్రం అబద్ధమే-అక్షరాలా అబద్ధమే. కాబట్టి వ్రతభంగం జరిగింది. సత్యం ఆముదంత్రాగిన ముఖంపెట్టాడు. కాని ఇందు పేదకు పెన్నిధి దొరకిన చందంబున మన సత్యం బుర్రలో ఒక ఆలోచన మెరపులా మెరసింది. ఒకరోజు అంటె 24 గంటలుగదా! పోనీ ఇప్పటినుండి ఇక 24 గంటలు అబద్ధమాడక పోతే ఒకరోజు ఆడనట్లే అని ఆనందించాడు.

కాని తనఆఫీసరుముందు అన్నమాట మనసులో పదేపదే మెదలటం మొదలుపెట్టింది. తనను ప్రాణప్రదంగా చూచుకొనే కుసుమకు జ్వరమని చెప్పానే ? నిజంగా జ్వరం తగిలితే-ఆ సుకుమారమైన చెక్కిళ్లూ-నల్లని విశాలమైనకళ్ళూ అన్నిటికన్నా దొండపండును బోలిన ఆ అధరద్వయము ఎంత చిక్కిపోతాయో? కుసుమకు జ్వరంతగిలితే తను భరించగలడా! ఆ నాడు తలనొప్పివేసినందుకు కుసుమను తెల్లవార్లు తన వక్షస్థలం మీదనే పడుకోబెట్టుకున్నాడు. ఉన్నట్లుండి అతని నేత్రాలు సజలాలయినవి. ఆఫీసరు తనసీటుదగ్గరకొచ్చి 'ఏమోయి! నీ భార్యకు జ్వరంవచ్చిందన్నావే తగ్గినదా! అని విచారించాడు. ఈ మాట పుండుమీద కారం చల్లినట్లయింది. "లేదుసార్! అందుకు 4 గంటలనుండి పర్మిషను యిప్పించాలి అని పర్మిషను లెటరు వ్రాసి యిచ్చాడు.

సత్యం బజారుకువచ్చాడు. అప్పుడు అతనికి కుసుమపై ఎంతో ఆదరణ కలిగింది. ఆమె ఎన్నోరోజులనుండి కోరు

కుంటున్నా కొనని చీరెను కొన్నాడు ఈ రోజు. సంతోషంతో యింటికిపోయాడు. కుసుమ చిరునవ్వుతో ఆహ్వానించింది. అప్పుడు కుసుమ పచ్చషిఫానువాయిల్ చీరె వేసికొనివుంది. నీల వెల్వెట్ రవిక వేసికుంది. తుమ్మెద రెక్కల్లాంటి తన వెంట్రుకలను రెండు జడలుగా వేసికొంది. అందులో లేతగులాబిలాంటి చెక్కిళ్ళు, సన్నని చుబుకం, నవ్వినపుడు చంద్రకాంతిలా కనపడే తెల్లని పలువరుస కుసుమ నిజంగా కుసుమపేశల. ఈవిధంగా అలంకరించుకొని వున్న కుసుమను చూచేవరకు సత్యం హృదయం ఆనందాశ్చర్యాలతో నిండిపోయింది. కుసుమకు చీరె చూపి ఆనందచకితురాలను చేయాలని లోపలికిపోయి 'కుసుమా! ఈలా రా!' అని పిలిచి రావటంతోనే తలుపువేసి అమాంతంగా కౌగలించుకున్నాడు. బాలహరిణిలా కుసుమ బిత్తరపోయింది. వదలించుకోచూచింది. కాని సత్యం అప్రమత్తుడు కాలేదు. ఆమెను తన రెండు చేతులపై నిడుకొని టేబులుపై కూర్చోబెట్టి 'ఇదిగో కుసుమా? ఏమిటో చూడు' అని చీరె పాకెట్ యిచ్చాడు. కుసుమ ముఖంలో అప్పుడే వికసిస్తున్న చంద్రకిరణాలలాగా హాస్యం ప్రసరించింది. "ఏమండీ! ఈవాళ త్వరగా వచ్చారేం!" అని ప్రశ్నించింది. ఆఁ యీరోజు సాయంత్రంనుండి శలవులే — కాని, ఇప్పుడు మనము సినిమాకు పోదాము అని తనకుగల డ్రెస్‌లో కుసుమ సెలక్టు చేసింది వేసికొన్నాడు.

సినిమా చూస్తున్న సత్యం తన్మయుడౌతున్నాడు. ఇంతలో ఇంటర్‌వెల్ అయింది. లైట్లువేశారు. తన ముందు సీటులో తన ఆఫీసరు ఆయనభార్యతో వచ్చి కూర్చునివున్నాడు. ఈయనను చూడటంతోనే పంచప్రాణాలలో నాలుగెగిరిపోయాయి సత్యానికి. ఆ ఆఫీసరు ఊరుకోకుండా 'ఏమోయ్ సత్యం ఏలా వుంది నీ భార్యకు — ఈమె ఎవరూ?' అని అడిగాడు. సత్యం సంకోచించకుండానే "అలానే వుంది. జ్వరము మాత్రము తగ్గలేదు. ఈమె నా మరదలు సుమ. అచ్చంగా నాభార్యపోలికే" అని తల వంచుకున్నాడు. ఇదంతా వింటున్న కుసుమ ఏమీ అర్ధంకాక ఆశ్చర్యపడింది. తనపేరు సుమా? ఈయనకు తను మరదలా ? కాని కుసుమ అప్పుడు ఏమీ మాట్లాడదలచుకోలేదు. కుసుమతోసహా ఇంటికి చేరిన సత్యం భోజనంవద్ద కూర్చున్నాడు. "ఏమండీ! ఎవరికి జ్వరం! నేను నీ మరదలు సుమనా?" అని అడిగింది కొంటెగా! ఓ అదా! తరువాత చెపుతాను ముందు భోజనంచెయ్యి అన్నాడు. అలవాటు ప్రకారం పండువెన్నెలలో ఒకే ప్లేటులో యిద్దరూ భోంచేశారు.

మల్లెపందిరిక్రింద మంచం వేసింది కుసుమ. తెల్లని దుప్పటి పరిచింది. పుష్పసౌరభము కమ్మగా వస్తున్నది. మలయమారుతం పండువెన్నెల నిర్మల నీలాకాశంలో ఆడుకుంటున్నాడు సుధాంశుడు. ఆ సమయంలో రతీదేవిలా అలంకరించుకొనివచ్చింది అజంతాకన్యలా. ముడిచిన కురులలోని మనోరంజని మనసును రంజింపచేస్తుంది. ఆమె అందించిన పాలను త్రాగి 'కుసుమా!' అని అప్యాయంగా దగ్గరకుతీసికొన్నాడు "కుసుమా ఈరోజు మా ఆఫీసరు కుమార్తె పుట్టినరోజు పండుగ. (అసలు ఆఫీసరుకు పిల్లలులేరు సరిగదా! భార్య గర్భవతియైనా కాలేదు) అందుకని భోజనానికి పిలచాడు (ఆయన పిల్లకి బిచ్చంవెయ్యని పిశినారి) నిన్ను సినిమాకు తీసికొనిపోవాలని నీకు జ్వరమని చెప్పాను. కాబట్టి సినిమాలో మరదలు అని చెప్పాను అన్నాడు. కుసుమ తన వక్షస్థలంపై నిద్రపోయింది. ఆమెను మెల్లగా ప్రక్కపై పడుకోబెట్టాడు. ఆమె ముఖం ఎంతో ప్రశాంతంగా వుంది అమాయకత్వం తొణికిసలాడుతుంది. సత్యం అప్యాయంగా ముద్దుపెట్టుకున్నాడు. ఏమి చెప్పినా నమ్ముతుంది పాపం. అనవసరంగా ఉదయం కోపపడ్డానే అని ఖేదపడ్డాడు సత్యం.

ఉదయం అనుకున్నది జరుపలేకపోయాడు. తెలియకుండానే అబద్ధాలాడాడు. కాని చేసేది ఏమీలేక రేపటికి వాయిదా వేసికున్నాడు సత్యం.

★


# సిప్పిలినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు : మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును.

20 పూటలమందు రూ. 3=50 న.పై.

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376, మద్రాసు-1.